"సోగ్గాదే.. చిన్ని నాయనా....ఒక పిట్ట నైన.... సోగ్గాదే ... చిన్ని... బాబూ అయ్యా.... ధర్మం బాబూ.... గుప్పెడు బియ్యం....దణ్ణం పెడతా బాబూ ధర్మం.... సోగ్గాదే చిన్ని నాయనే...."

మెళ్ళో హార్మోనియం కట్టుకొని ఎగురుతున్నాడు ముష్టివాడు. ఒక భుజం నుంచి పాత చిరుగుల మూట వ్రేలాడుతోంది. అంత ఎండలో చెమటలు దిగజారుతున్నా గిరగిరా తిరుగుతూ డాన్సు చేస్తున్నాడు.

"చిన్ని" కళ్ళు నిశ్చలంగా ఆ ముష్టివాడి వంకే చూస్తున్నాయి. ముష్టివాడి కాళ్ళతో పాటు చిన్ని కళ్ళు గిరగిరతిరుగుతున్నాయి. ముష్టివాడి వేళ్ళు హార్మోనియం మీద నాట్యం చేస్తున్నాయి. చిన్ని కడుపులో ఎలుకలు గంతులేస్తున్నాయి.

గట్టుమీద రెండు మోకాళ్ళు ముడుచుకుని. మోకాలి మీద గడ్డం ఆన్చి అలాగే చూస్తున్నాడు పదేళ్ళ చిన్ని.

హార్మోనియం తారాస్థాయిని అందుకుంటోంది. ముష్టివాడి చుట్టూ చాలామంది పిల్లలు చేరారు. అతను అదిలించినప్పుడల్లా గొల్లున అరుస్తూ వెనక్కి పారిపోయి. మళ్ళీ మూగుతున్నారు.

"ఎవర్రా అక్కడ! ఒరే చిన్నిగా!" పెద్దగా అరుస్తూ సందులోనుంచి రాజ్యం పిన్ని పరిగెత్తుకు వచ్చింది.


చిన్ని ఉలిక్కిపడ్డాడు. గుండెలు వేగంగా కొట్టుకోసాగాయి. పిన్ని ఎడంచేతిని అదిలిస్తూ "వెళ్ళవాయి. వెళ్ళు" పెద్దగా అరిచింది.

"సోగ్గాదే..గ్గాదే..దే."



# పితృదేవతలు

పి. శ్రీరామచంద్రమూర్తి




"ఇదిగో! ఏయ్! నీకొక్కడూ చెప్పేది.. వెళ్ళమంటుంటే.." అతని గొంతుతో పాటు పిన్ని గొంతుకూడా తారాస్థాయినందుకొంది.

"అమ్మా..ధర్మం చెయ్ తల్లీ.."

"సరిసర్లే! అందరూ మడికట్టుకున్నారు. ఇపుడు వీలులేదు. పక్కింటికి వెళ్ళు!" ఈసడింపుగా అంది.

ముష్టివాడు నిరాశగా చూసి ముందుకు కదిలాడు. అతని వెనకే పిల్లలు పరిగెత్తారు.

రాజ్యం పిన్ని మండిపడుతూ చిన్ని వంక చూసింది. చిన్ని వణికిపోతూ లేచి నించున్నాడు.

పిన్ని కళ్ళు ఎర్రగా మండుతున్నాయి. అసలే అరిచి ఉండడం వల్ల ఇంకా కోపంగా ఉంది!

"అంట్ల వెధవా! నిన్నిక్కడ కూర్చోపెట్టింది తైతెక్కలు చూడమని కాదు! ముష్టి వాళ్ళు రాకుండా కాపలా కాయమని! అవతల అందరూ మడికట్టుకున్నారు. ఆ శీను గాడిని లోపలికే పంపించేశావు! నీకు చెప్పిం చేమిటి.... చేసేదేమిటి?"

ఆవిడ కళ్ళు! ఆవిడ కట్టుకున్న ఎర్రటి మడి చీరకు మల్లే మండిపోతున్నాయి. అదృష్టంకొద్దీ ఆవిడ మడిలో ఉంది కాబట్టి సరిపోయింది లేకపోతే చిన్ని ఒళ్ళు పేలిపోయేది.

పిన్ని సందులోకి వెళ్ళి పెద్దగా అరిచింది.

"కావుడూ.... ఒసే కావుడూ....నిన్నేనే ఎక్కడ చచ్చావు?"

ఇవతల సందులోనుంచి పరిగెత్తుకొచ్చింది కావుడు.

ఎర్రగళ్ళ పట్టుపరికిణీ. బుట్టచేతుల జాకెట్టు, జడకుప్పెలు.... జడనిండా మల్లె పూలు.... ఒకచేతితో పరికిణీ కాళ్ళకు అడ్డం పడకుండా ఎత్తి పట్టుకుని, మరోచేత్తో గచ్చకాయలు ఎగరేస్తూ హుషారుగా వచ్చిన దల్లా తల్లి స్వరూపంచూసి నెమ్మదిగా అడుగులో అడుగు వేసుకుంటూ వచ్చింది.

"అమ్మా....పిలిచావా?"

"పాపిష్టిదానా....ఎక్కడకు పోయావే.. ఇక్కడ అరిచి అరిచి గొంతు పోతుంటేనూ...."

కావుడు మాట్లాడకుండా గచ్చకాయలు ఆ చేతిలోంచి ఈ చేతిలోకి ఈ చేతినుంచి ఆ చేతిలోకి శబ్దమయ్యేలాపోస్తూ నిల్చుంది.

"నిన్నేనే.... మాట్లాడవేం...."

"వెంకటలక్ష్మి వాళ్ళింట్లో...."

"గచ్చకాయలు ఆడుతున్నావు.... అంతేనా!" ఉరిమిచూస్తూ అంది ఆవిడ. కావుడునేల చూపులు చూస్తూ నిల్చుంది.

"ఆటా పాటలకి వేళాపాళా లేదా! ఇదిగో ఇక్కడ కూర్చుని ముష్టివాళ్ళు రాకుండా కాపలా కాయి! తెల్సిందా!"

కావుడు తెలిసిందన్నట్లు బుద్ధిగా తలూపింది.

"ఈ వెధవ గుర్లప్పగించి చూడటం తప్పితే పనీలేదూ....పాడూలేదు!" కావుడు చిన్ని వంక జాలిగా చూసింది.

చిన్ని కళ్ళల్లో నీళ్ల నిండుకున్నాయి. చప్పున తుడిచేసుకున్నాడు.

"ఒరే వెధవా! ఇంకా ఇక్కడెందుకూ? దొడ్లోకి పద! అక్కడ కుక్కలూ అవీ రాకుండా చూడు! అసలే పక్కింటివాళ్ళది దొంగ కుక్క!"

అలాగే నన్నట్లు బలవంతంగా తలూపాడు చిన్ని!

ఇంతలో ఇంట్లో నుంచి "రాజ్యం" అని పిలుపు వినిపించింది.

"ఆ....వస్తున్నా అక్కయ్యా!" గబగబా ముందుకి నాలుగడుగులు వేసి మళ్ళీ వెనక్కి తిరిగి చూస్తూ హెచ్చరించింది.

"ఇదిగో నే చెప్పినట్లు చేయకపోతే మైలపడి మరీ మీపని చెబుతాను!"

చిన్ని నీరసంగా గుంజకు తలఆనించాడు!

మిట్ట మధ్యాహ్నం 11-30 అవుతోంది! ఎండ నిప్పులు చెరిగిపోస్తోంది.

"వెళ్ళు. ఇక్కడే నించున్నావేం? వాకిట్లో నేనుంటాలే!" ధీమాగా అంది కావుడు.

కసిగా చూశాడు చిన్ని!

గట్టుమీద కూర్చుని గచ్చకాయలు ఎగరేస్తూ ఆడుతున్న కావుడు తలెత్తి చూసి "నిన్నే" అంది.

"నీకేం! పొద్దున్నే బాగా మెక్కావు! ఎక్కడైనా కాపలా కాస్తావు!" ఆవేశంగా కసిగా అన్నాడు చిన్ని!

"ఏం? పొద్దున్న నువ్వు చద్దన్నం తినలేదు?"

"ఊహుఁ! బాబాయి బజారుకు వెళ్ళి రమ్మన్నాడు. వెళ్ళొచ్చేసరికి అందరూ మడికట్టుకున్నారు. ఇంకెవరు పెడతారు? భలే ఆకలేస్తోంది!"

"నీ ఖర్మ .... ఫో...." ఎగరేసిన కాయని పట్టుకుంటూ అంది కావుడు.

చిన్నికి విపరీతమైన కోపం వచ్చింది. ఆకలికి అసహనం తోడయింది. కడుపులో ప్రేగులు మెలిపెట్టినట్లుగా ఉన్నాయి. పొద్దుటినుంచి కనీసం కాఫీ అయినా త్రాగలేదు! కాని చిన్ని మొర ఆలకించే వారెవరు?

చిన్ని కసికొద్దీ గచ్చకాయలను ఒక్క తన్నుతన్ని పరిగెత్తాడు. గచ్చకాయలు చెల్లాచెదురుగా రోడ్డు మీదికి వెళ్ళిపడ్డాయి! కావుడు వెంటనే నోరుతెరిచి ఏడవటానికి సిద్ధమయింది. సందులోకి పరుగెత్తుతున్న వాడల్లా, చిన్ని వెనక్కి తిరిగి చూశాడు! కావుడు ఏడవడమూ- పిన్ని రావటమూ.. కర్తవ్యం ఠక్కున స్ఫురించినట్లయింది! గబగబా తిరిగివచ్చి రోడ్డుమీద పడ్డ కాయలన్నీ ఏరి తీసుకొచ్చి కావుడు దోసిట్లో పోశాడు!

కావుడు విజయగర్వంతో చూసింది.

చిన్ని కళ్ళలో గిర్రున నీళ్ళు తిరిగాయి! పెదవి బిగపట్టి ఆపుకున్నాడు! తన అసహాయతకు తనమీద తనకే కోపం వచ్చింది! గిరుక్కున వెనుదిరిగి సందులోకి పరిగెత్తాడు!

దొడ్లో రోలుదగ్గర కూర్చుని అక్క శ్రీవల్లి పప్పు రుబ్బుతోంది!

చిన్నిని చూడగనే కళ్ళు మెరిశాయి.

"ఒరేయ్ చిన్నీ! అక్కడ బావి గట్టు మీద బేసిన్ వుంది తీసుకురా!" ఆవిడ ఆజ్ఞకు తిరుగులేదు.

బావి దగ్గర పనిమనిషి సీతాలు కళాయిల నిండా, బకెట్ల నిండా నీళ్ళు తోడిపోస్తోంది!

పనిమనిషికి వంటిల్లు కనిపించకుండా

కిటికీ రెక్కలు మూసేశారు।

చిన్ని వెళ్ళి తేపిన్ తీసుకొచ్చి అక్కయ్యకు ఇచ్చివెళ్ళి బాదం చెట్టుక్రింద కూర్చున్నాడు।

సీతాలు ముందర అన్ని ఇళ్ళలో పని చూసుకుని తీరికగా రాఘవరావుగారింటికి వచ్చింది.

ఆ రోజు రాఘవరావుగారింట్లో రాఘవరావు తండ్రి సీతాపతిరావుగారి ఆబ్దికం. అంటే "చిన్ని" తాతయ్యది.

రాఘవరావుఎప్పుడూ ఘనంగానే చేస్తాడు తండ్రి ఆబ్దికం। లేకపోతే చచ్చి స్వర్గంలో ఉన్న తండ్రి ఆత్మ శాంతించదు.

సీతాపతిరావుగారికి ఇద్దరు కొడుకులు. పెద్దవాడు రాఘవరావు. రెండు జనార్దనం. రాఘవరావుగారిల్లు ఆచారాలకు. సంప్రదాయాలకు పెట్టింది పేరు. పెద్దవాళ్ళు పెట్టిన ఆచారాలు రాఘవరావుగారు వరసత్వంగా పుణికిపుచ్చుకుని. వాటిని అమలు పరుస్తున్నారు. తను చచ్చిపోగానే తన కోసం స్వర్గలోక ద్వారాలు బార్లా తెరిచి వుంటాయని రాఘవరావుగారి ప్రగాఢ నమ్మకం।

ఆచారాలకు ఏ మాత్రం భంగం వాటిల్లినా ఆయన సహించడు। ఆయన అడుగుజాడల్లో నడిచేదే ఆయన భార్య కాంతమ్మ.

ఆబ్దికం రెండు రోజు లుండనగానే అందరూ దిగారు. జనార్దనం. అతని భార్య రాజ్యం. వారి కూతురు కావుడు. రాఘవరావుగారి పెద్ద కొడుకు. రెండో కొడుకూ ఇద్దరు కోడళ్ళు. కూతురు శ్రీవల్లీ. అల్లుడూ. పిల్లాజెల్లా అందరితో ఆ ఇల్లు మహా సందడిగా వుంది. కాంతమ్మగారికి కాలూ చెయ్యి ఆడనంత కంగారుగా వుంది. అందరూ పొద్దున్నే లేచి. కాలకృత్యాలుతీర్చుకుని కాఫీలు సేవించారు. టిఫిన్ మాత్రం తీసుకోలేదు. కాఫీ ద్రవపదార్థం కాబట్టి ఆ మాత్రం అదృష్టానికి నోచుకుంది. అందరూ తలారా స్నానాలుచేసి మడికట్టుకున్నారు.

వాకిలి తలుపు బంధించారు.

ఈ లోపల బ్రాహ్మణులు వచ్చారు. తతంగమంతా జరుగుతోంది.

"ఒరేయ్ చిన్నీ!"

ఇదంతా చూస్తూ నీరసంగా బాదంచెట్టుకు చేరగిలబడిన చిన్ని ఉలిక్కి పడ్డాడు. దొడ్డి గుమ్మందగ్గర నుంచున్న జనార్దనంబాబాయి పిలుస్తున్నాడు.

చేతిమీదపడ్డ గండుచీమని దులుపుకుంటూ లేచాడు చిన్ని.

ఈలోపలే బాబాయి ఇవతలకువచ్చి. చిన్నిని అవతలకు తీసుకెళ్ళాడు. "ఇదిగో చిన్నీ! ఆ వత్యం కొట్టు దగ్గరకు వెళ్ళి సిగరెట్లు పట్టుకురా। నేను చెప్పానని చెప్పు। తెలిసిందా। త్వరగా పో...."

అలాగేనని తలూపి పరిగెత్తబోయిన చిన్ని బాబాయి పిలుపుతో మళ్ళీ ఆగాడు.

"అవి తీసుకొచ్చి పెద్దగా అరవమాకు నాకే ఇవ్వు!"

చిన్ని లేని ఉత్సాహాన్ని కూడదీసుకుంటూ పరిగెత్తాడు.

జనార్దనం తల గోక్కుంటూ ఇవతలకు వచ్చాడు. అక్కడే పప్పు రుబ్బుతున్న శ్రీవల్లి రుబ్బటం ఆపి నవ్వుతూ అంది.

"ఏమిటి బాబాయి వాడితో రహస్యాలు।"

"అబ్బే.... ఏం లేదు।"

"నాకు తెల్సులే....సిగరెట్లకోసమేగా।" నవ్వాడు. "నోటి దురద। ఏంచేస్తాం।"

సీతాలువైపు తిరిగి "ఏయ్। సీతాలూ। త్వరగా తోడు। చూడు। అప్పుడే కళాయి ఖాళీ అయిపోయింది। ఈ రోజుకేగా కాస్త శ్రమపడు మరి।"

చేతులు నొప్పిపుట్టేటట్లు తోడిపోస్తున్న సీతాలుకు విసుగు పుట్టింది. అయినా తప్పదు మరి క్రింద గచ్చుమీద కాళ్ళు మాడిపోతున్నాయి.


ఇంతలో చిన్ని పరిగెత్తుకొచ్చాడు ఆయాసంగా.

"బాబాయ్!" రహస్యంగా పిలిచాడు. జనార్దనం "ఆ! వస్తున్నా!" అంటూ హడావుడిగా దొడ్డివైపు వెనక్కి వచ్చాడు.

"ఇదిగో సిగరెట్లు!"

"అబ్బ.... అలా మీదపడతావేం? ఎత్తి పెంట్లో పడేస్తున్నానని ఆమాత్రం తెలియదూ..." చిన్నగా కసురుకుంటూ తీసుకున్నాడు.

చిన్ని జాగ్రత్తగా సిగరెట్ పాకెట్ [illegible] ఎత్తి పడేశాడు।




జనార్దనం వడుంచుట్టూ కట్టుకున్న తువ్వాలు తొలగించి. అగ్గిపెట్టెతీసి వెలిగించుకోబోయినవాడల్లా ఆగి. చిన్నివైపు చూస్తూ "నువ్వు ఇక్కడెందుకురా వెధవా। వాకిట్లోకి పో!" అని విసుక్కున్నాడు.

"పిన్ని ఇక్కడే ఉండమంది."

విసుగ్గా చూశాడు జనార్దనం.

"ఊ! అవతలకు ఏడువు" అని సిగరెట్ వెలిగించుకుని పొగ రింగులు రింగులుగా వదలసాగాడు.

చిన్ని దిక్కుమాలిన ముఖం వేసుకుని ఇవతలకు వచ్చాడు.

వంటింట్లోనుంచి రకరకాల వంటకాల వాసనలు వస్తున్నాయి. గారెల చుయ్ చుయ్ శబ్దాలు చిన్నిని ఏవేవో లోకాలకు తీసికెళ్తున్నాయి.

పులుసు..పప్పు కూర.. పరవాణ్ణం. రకరకాల వాసనలు మిళితమయి చిన్ని మదిలో గిలిగింతలు పెడుతున్నాయి.

నోట్లో లాలాజలంతో పాటు. కళ్ళల్లో నీళ్ళు తిరుగుతున్నాయి.


బాదం చెట్టుకు గండుచీమలు విపరీతంగా ఉన్నాయి. ఆకుల సందుల్లో నుంచి సూర్యకిరణాలు తమప్రతాపాన్ని చూపిస్తున్నాయి.

చిన్ని కాళ్ళు పీక్కుపోతున్నాయి। ఒక్కసారి వంటింట్లోకి వెళ్ళి తృప్తి దీరా అన్నింటినీ కలయ చూడాలనిపిస్తోంది. కాని లాభం లేదు, వంటింట్లోకి అడుగు పెడితే అందరూ కలిసి కాళ్ళు విరగ్గొడతారు. అందరూ మడికట్టుకుని ఉన్నారు.

చిన్నికి హఠాత్తుగా చెప్పలేనంత నీరసం అనిపించింది. దాని దగ్గరకు వెళ్ళి ముఖం కడుక్కోవాలనిపించింది. లేచి నీరసంగా దాని వైపు నడిచాడు.

మధ్యలోనే వంటింటి గుమ్మం.

అప్రయత్నంగా చిన్ని కళ్ళు ఓరగా వేసి




ఉన్న తలుపుల మధ్య నుంచి మధ్య యింట్లోకి దూసుకుపోయాయి.

అక్కడ హోమం చేయబడి ఉంది. చుట్టూరా వళ్ళాలలో గారెలు. పరవాణ్ణం.... రకరకాల వంటకాలు....

చిన్ని శరీరంలో ఆకలి ఒక్కసారిగా పెనుభూతం ఆకారం దాల్చింది. ఆకలి నాలికలు జాపుకుంటూ బొడ్డు గగ్గర నుంచి జ్వాలలు రేపుకుంటూ గొంతుదాకా జ్వలిస్తున్నది. చిన్నికి ఒక్కసారిగా పరిగెత్తుకెళ్ళి వాటిమీద పడి పిచ్చిగా వెర్రిగా.. కసిదీరా కడుపునిండా తినాలనిపించింది.

చిన్ని చటుక్కున ముఖం తిప్పుకుని బావి దగ్గరకు పరిగెత్తి గబగబాముఖం కడుక్కున్నాడు. కడుపునిండా నీళ్ళు తాగాడు.

ఇవతలకు వస్తూ వంటింటి గుమ్మం దగ్గర దక్షిణంవేపు ఆగాడు. అటువైపు చూడాలనే కోర్కెను బలవంతంగా ఆపుకుని గబగబా వచ్చి బాదంచెట్టు దగ్గర చతికిలపడ్డాడు.

"జనార్దనం— ఒరే జనార్దనం!" లోపల నుంచి పిలుస్తున్నారు.

బాదం చెట్టుకు అవతల ఉన్న జనార్దనం కంగారుగా సిగరెట్‌ను అవతల పారేసి "ఆ! వస్తున్నా!" అంటూ హడావిడిగా వెళ్ళాడు.

లోపల నుంచి మంత్రోచ్చారణ అస్పష్టంగా వినిపిస్తోంది!

ఇంతలో కాంతమ్మగారు ఎందుకో తలుపు తీసుకుని దొడ్లోకి వచ్చారు.

చిన్ని ఆశగా లేచి నించున్నాడు.

"అమ్మా!" నీరసంగా పిలిచాడు.

పని మనిషికి ఏదో పురమాయిస్తున్న ఆవిడ వెనక్కి తిరిగి చూసింది.

తలారా స్నానం చేయటం వలన పండిపోయిన ఆవిడ జుట్టు తమాషాగా మెరుస్తోంది. వదులుగా వేసుకున్న ముడిలో ఎర్రటి ముద్దమందారం. ఆవిడ ముఖంమీది కాసంత బొట్టు పోటీపడుతున్నాయి.

"ఏవిట్రా.... చిన్నీ...."

"అమ్మా.... ఆకలిగా వుందే!"

"పొద్దున్న చద్దన్నం తినలేదూ...."

"లేదమ్మా....బజారుకు వెళ్ళి వచ్చేసరికి.."

ఆపైన మాటలను ఏడుపు దిగమింగేసింది.

"అయ్యో....పిన్నిని పెట్టమన్నానే.... నేనూ హడావిడిలో పట్టించుకోలేదు."

చిన్ని మాట్లాడలేదు....కళ్ళల్లో నీళ్ళు ఉబికి వస్తున్నాయి.

"ఊరుకో నాన్న! బ్రాహ్మణుల భోజనాలయిపోగానే మీకూ పెట్టేస్తారు! ఇవ్వాల్టికి కాస్త ఓర్చుకో!"

చిన్ని మాట్లాడలేకపోయాడు.

"పోనీ డబ్బులిస్తా.... ఏవన్నా కొనుక్కో!"

చిన్ని కళ్ళు ఆశతో మిలమిల మెరిశాయి. ఆవిడ లోపలికి వెళ్ళింది.

ఇంతక్రితం చచ్చిపోయినట్లు వున్న ఆకలి వేయిచేతులు విరుచుకుంటూ లేచింది.

క్షణాలు యుగాల్లా గడుస్తున్నాయి.

కాసేపటికి కాంతమ్మగారు బయటకు వచ్చి చిన్ని చేతిలో పావలాకాసు ఎత్తి పడేశారు. "నాదగ్గర ఇంతకన్నా లేవురా!"

"పోనీలే.." అంటూ చిన్ని తూనీగలా వీధిలోకి పరిగెత్తాడు!

సూర్యుడు తన కోపాన్నంతా తీక్షణ కిరణాల ద్వారా ప్రజ్వలింపచేస్తున్నాడు. కాళ్ళు చుర్రుమంటున్నాయి. నెత్తి మాడిపోతోంది.

చిన్ని సత్యం కొట్టు దగ్గరకు వచ్చి క్షణంసేపు అలుపు తీర్చుకున్నాడు.

చిన్నగా ఆయాసపడుతూ కొట్టువైపు చూసిన చిన్ని చెళ్ళున ముఖం మీద నీళ్ళు కొట్టినట్లుగా వెనక్కి తగ్గాడు.

తాళం వేసిన సత్యం బడ్డీకొట్టు వెక్కిరిస్తూ కనిపించింది.

నిజమే! భోజనాల వేళ కొట్లు ఎవరు తీస్తారు

చిన్నికి ఒక్కసారిగా ఏడుపు. నీరసం. అంతులేని కోపం ఉక్కుమ్మడిగా ముంచుకొచ్చాయి.

కసికొద్దీ బడ్డీకొట్టుని తన్నాడు. మాడి మాడి ఉన్న రేకు చురుక్కున కాలింది.

"అబ్బా!" అనలేకపోయాడు చిన్ని.

నీరసంగా వెనక్కి తిరిగి వచ్చాడు! ఇంకో కొట్టుకు వెళ్ళే ఓపికలేదు. అక్కడే గుంజనానుకుని కావుడు కునికిపాట్లు పడుతోంది. ఇంతక్రితమే తల్లి చాటుగా తెచ్చిపెట్టిన గారెలు. అరిసెలు కడుపులో పని చేయటం ప్రారంభించినట్లున్నాయి. అలికిడికి ఉలిక్కిపడి కళ్ళు తెరిచింది.

ఎదురుగా చెమటలు దిగజారుతూ చిన్ని.

"ఎక్కడికి పోయావు? అందరూ నీకోసం వెతుకుతున్నారు"విసుగ్గాఅని మళ్ళీ గుంజకు చేరగిలపడింది.

చిన్ని గుండె ఠార్‌మంది. చటుక్కున దొడ్లోకి పరిగెత్తాడు.

అక్కడెవ్వరూ లేరు. సీతాలు ఒక్కతే బావి గట్టుమీద కొంచెం నీడలో బాదంకాయ కొరుకుతూ కూర్చుంది.

దొడ్డి తలుపు వేసేసి ఉంది. లోపల గిన్నెల చప్పుడు. అడుగుల చప్పుడూ వినిపిస్తోంది. భోజనాలు చేస్తున్నట్లున్నారు.

చిన్ని మళ్ళీ బాదం చెట్టు నీడలో కూలబడి కళ్ళు మూసుకున్నాడు.

అలికిడికి తల తిప్పి చూశాడు.

నల్లకుక్క ఒకటి ఓరగా వేసి ఉన్న స్టోర్ రూమ్ తలుపులను తెరవటానికి ప్రయత్నిస్తోంది.

చిన్ని గబుక్కున లేచి "ఛాయ్ ఛాయ్" అంటూ దాన్ని అవతలకు తరిమాడు. అది అంతదూరం వెళ్ళినట్లేవెళ్ళి మళ్ళీ వెనక్కి వచ్చి స్టోర్ రూమ్ తలుపుదగ్గర తోకాడించుకుంటూ నిల్చుంది.

చిన్నికి పట్టలేని ఉక్రోషం వచ్చింది. ఆఖరికి కుక్కకూడా తనని వెక్కిరిస్తోంది. చిన్ని చటుక్కున పక్కనే అందుబాటులో ఉన్న ఇటుకరాయి తీసుకుని శక్తికొద్దీ దాని మీదికి విసిరాడు. అది "కుయ్యో" మంటూ మూలిగి పరిగెత్తింది. వెనక్కి తిరిగి స్టోర్ రూమ్ తలుపు దగ్గరకు వేయబోయిన చిన్ని అలాగే ఉండిపోయాడు. గుండె క్షణంసేపు ఆగి మళ్ళీ కొట్టుకోవడం ప్రారంభించింది.

ఎదురుగుండా కట్టెపుల్లలపక్కన జర్మన్ సిల్వర్ టిఫిన్ నిండా ఎత్తుగా అన్నం

కరుడ్లు.... దానిమీద తీసిపెట్టివున్న మూత మీద చింతకాయ పచ్చడి. పక్కనే సత్తు గిన్నెలో పులుసు.

సీతాలు ఎక్కడో పనిచేసి తెచ్చుకుని అక్కడ పెట్టుకున్నట్టుంది.

ఆకలి రెక్కలు విప్పుకుంది. శరీర మంతా ఆక్రమించుకుంటోంది. లాలాజలం సముద్రంలో అలలకుమల్లే వస్తోంది. కళ్ళల్లో నీళ్ళు తిరుగుతున్నాయి. చిన్నికి ఏం చెయ్యాలో తోచడంలేదు. కళ్ళు విప్పార్చుకుని వాటివైపే చూస్తున్నాడు. అది తమ యింట్లో పనిచేసే పనిమనిషి తెచ్చుకున్న అన్నం.

అది తను తింటే మహా పాపం.. నాన్నకు తెలిస్తే ఇంకేమయినా ఉందా? చంపేస్తాడు. టిఫిన్‌కు వేలకొద్దీ చేతులు వచ్చి రారమ్మని ఆహ్వానిస్తున్నట్లుగా ఉంది. అన్నం మెతుకులు వెలిసిపోయిన ముత్యాల్లా ఉన్నాయి!

చింతకాయ పచ్చడి రత్నాల ముద్దలా ఉంది!

లోపలికి దూసుకువచ్చిన సూర్యకిరణాలు పులుసులో ప్రతిఫలిస్తున్నాయి.

చిన్ని కళ్ళు అప్రయత్నంగా చుట్టూ చూశాయి!

ఎవ్వరూ లేరు!

చటుక్కున లోపలికి దూరి తలుపు వేసుకున్నాడు.

మోకాళ్ళమీద కిందకువంగి కూర్చున్నాడు!

శరీరమంతా చలిజ్వరం వచ్చినట్లుగా వణుకుతోంది.

చిన్ని వణుకుతున్నచేతులతో అన్నాన్ని ముట్టుకున్నాడు. చద్దిఅన్నం చల్లగా తగిలింది. నరాలన్నీ జివ్వున లాగాయి! చటుక్కున చెయ్యి వెనక్కి తీసుకున్నాడు.


పెదవులు వణుకుతున్నాయి. శరీరమంతా తడిసి ముద్దయింది!

చేతులు నిక్కరుకు తుడుచుకుని గబుక్కున టిఫిన్‌లో అన్నాన్ని చిన్ని చేతులు గట్టిగా పట్టుకున్నాయి.

సత్తుగిన్నెలో పులుసంతా దాంట్లో వంచేశాడు. పచ్చడి వేసేశాడు. అంతా కలగా పులగంగా కలపసాగాడు.

చిన్నికి ఆవేశంగా ఉంది! ఏం చేస్తున్నాడో తనకే తెలియదు. గబగబా అన్నమంతా కలిపాడు. అన్నం రకరకాల రంగుల్లో ఉంది.

ఆవేశంతో ముద్ద నోట్లో పెట్టుకోబోయిన చిన్ని బర్రున తలుపుతీసిన శబ్దానికి అలాగే ఆగిపోయాడు. చేతులూ, శరీరం బిగుసుకు పోయాయి! ఒక్కసారిగా ఎండ లోపలికి దూసుకువచ్చింది.




తలుపును పట్టుకుని. కళ్ళు పెద్దవి చేసుకుని చూస్తోంది కావుడు!

చిన్ని బుర్ర పనిచేయడం మానేసింది. చేతిలోని ముద్ద జారిపోయి మసిలో పడింది. క్షణంసేపు ఒకరి కళ్ళల్లోకి మరొకరు అలాగే చూస్తుండిపోయారు.

హఠాత్తుగా కావుడు గావుకేకలు వేసింది! "అమ్మా .... నాన్నా .... అత్తయ్యా...." ఉన్నట్లుండి వాతావరణంలో మార్పు వచ్చింది.

ఏం జరిగిందోనని వడ్డిస్తున్నవాళ్ళందరూ చేతిలోని గిన్నెలు. గరిటలూ అక్కడే వదేసి కంగారుగా పరుగెత్తుకొచ్చారు.

స్టోర్‌రూమ్ దగ్గరకు వచ్చినవాళ్ళ కాళ్ళు బంధాలు వేసినట్లు ఆగిపోయాయి. వారి ఎదురుగుండా రూమ్‌లో. కట్టెపుల్లల పక్కగా. మసిలో. మోకాళ్ళమీద కూర్చున్న చిన్ని.... అతని ఎదురుగుండా టిఫిన్‌లో కలగాపులగమయిన అన్నం....

అందరి గుండెలూ ఒక్కసారిగా ఆగిపోయాయి.... మెదళ్ళు పనిచేయడం మానేశాయి!

చిన్ని కనీసం తలెత్తయినా చూడలేదు.

అందరూ ఆ దార్లో. స్టోర్‌రూమ్‌కు ఎదురుగుండా. బయట దడికట్టినట్లుగా వరుసగా విచిత్రాన్ని చూస్తూ నిలబడ్డారు.

జరిగింది కలో. నిజమో అర్థం కావడం లేదు.

చిన్నిని వింత మృగాన్ని చూసినట్లు చూస్తున్నారు.

నిప్పును కడిగే వంశమది!

ఆచారాల్ని. సంప్రదాయాల్ని కాచి వడబోసే వంశమది!

ఎంతోమంది దేవుళ్ళు. దేవతలు వెలిసిన వంశమది!

నిత్యము దేవతార్చనలు జరిగే వంశమది!

తాత ముత్తాతల దగ్గరనుంచి ఆచార వ్యవహారాలను భద్రంగా కాపాడుకొస్తూ పరువుగా బ్రతుకున్న వంశమది!

అటువంటి వంశంలో.... ఆ కులంలో పుట్టిన....

చిన్ని ఇంత ఘోరం చేశాడంటే ఇంకా ఎలా బ్రతికి ఉన్నామా అని అనుకుంటున్నారు. అంతసేపూ తలుపు తెరిచి పట్టుకున్న కావుడు భయంగా పరిగెత్తుకుని తల్లి దగ్గరకు పోయింది. మడి సంగతి మర్చిపోయి ఆమె కావుడిని దగ్గరకు తీసుకుంది.

సీతాలు వణికిపోతూ పక్కకు వెళ్ళి నిల్చుంది.

అందరూ భయం భయంగా జరగబోయే సన్నివేశాన్ని ఊహించుకుంటున్నారు.

భయంకరమయిన నిశ్శబ్దం ఎండ తీవ్రతను చుట్టేసింది.

కాంతమ్మగారి గుండెలు వేగంగా కొట్టుకుంటున్నాయి. రాఘవరావుగారు సరేసరి! మెళ్ళో జంధ్యం ఎగిరెగిరి పడుతోంది. ఆయన కళ్ళు చింతనిప్పులు కురుస్తున్నాయి.

అసలే అలసిపోయి వున్నారు ...పైగా భోజనాలవేళ.... అసహనం.... భరించలేని సన్నివేశం....ఎంతఘోరం....ఇంతమంది ముందు....కూతుళ్ళు....అల్లుళ్ళు ..కోడళ్ళు కొడుకులు....తన కుటుంబం....పరువు.... తన వంశ ఆచారం.... అన్నీ మట్టి కలిసి పోయాయి.

'భగవంతుడా!ఎక్కడ వున్నావయ్యా! ఇంత ఘోరం చూస్తూ ఎలా వున్నావయ్యా! అయ్యో....ఆచార సంప్రదాయాలకు మా వంశం పెట్టింది పేరే....అలాంటి వంశంలో ఈ నీచుడు.... హయ్యో....'

రాఘవరావుగారి మనసు ఆక్రోశిస్తోంది! గుండెల్లో అగ్ని గుండాలు ప్రజ్వరిల్లు

తున్నాయి. పితృదేవతలు విరగబడి నవ్వుతున్నారు....పరిహసిస్తున్నారు .... ఎగతాళి చేస్తున్నారు .... మండి పడ్తున్నారు.... నిప్పులు కురిపిస్తున్నారు ...వేల గొంతులతో అరుస్తున్నారు....ప్రశ్నిస్తున్నారు.

"ఇంతేనా నువ్వు చేసింది! ఇదేనా నీ ఆచారం! ఎన్నాళ్ళనుండో ఎంతో జాగ్రత్తగా, మా ప్రాణాలకంటే మిన్నగా ఈ వంశ పరువు మర్యాదలు కాపాడుకొస్తున్నామే! ఆఖరికి మా వంశ గౌరవ మర్యాదలు,ఆచారాన్ని మంటగలిపిండి నీ కుటుంబమేరా రాఘవా! నీ కుటుంబ వారసుడు ఆఖరికి ఈ స్థితికి దిగజారాడా? ఛీ! ఛీ! సిగ్గు చేటు!మా వంశానికే మాయని మచ్చ తెచ్చావు కదరా!రాఘవా!మా ఆత్మలు ఘోషిస్తున్నాయిరా! ఒరే రాఘవా!.."

"చి..నీ్..."ఆ పిలుపుకి ప్రకృతి స్తంభించింది. అందరి ఒళ్లూ జలదరించింది. రాఘవరావుగారు వేసే ఒక్కొక్క అడుగూ భూమి క్రుంగిపోతుందేమో అన్నట్లుగా ఉంది! చిన్ని కనుగుడ్లు బయటకు వచ్చేశాయి!

"ఏమండీ! చిన్నవాడు! వదిలేయండి!" భోరున ఏడుస్తూ కాంతమ్మగారు అడ్డుపడింది!

"ఆగు...." ఆవిడని రానీయకుండా చెయ్యి అడ్డుపెట్టి ముందుకు అడుగువేశాడు!

"ఆగండీ.... ఏమండీ...."

రాఘవరావుగారి కివేమీ వినిపించడం లేదు. ఆయన దృష్టంతా ఎదురుగుండా వణికిపోతూ మునగదీసుకుని కూర్చున్న చిన్ని మీదనే!

"ఏమండీ." కాంతమ్మగారు ఒక్కసారిగా భర్తను వెనక్కి విసురుగా లాగి. ఒక్క అంగలో లోపలికి వెళ్ళి చటుక్కున తలుపు వేసుకుంది.

బయట నుంచి రాఘవరావు పెద్దగా అరుస్తున్నాడు!

"ఒసేవ్.. కాంతం. తీయవే తలుపు తీయవే! ఆ నీచుడి.. భ్రష్టుడి శవం కళ్ళ చూసేదాకా అన్నం ముట్టనే..తీయవే..అదుగోనే.. నా తండ్రి..కన్న తండ్రి.... ఘోషిస్తున్నాడే! హయ్యో.."

కాంతమ్మగారు చిన్ని వైపు సూటిగా చూసింది...తీక్షణంగా.

"అ..మ్మా.."చిన్నగా గొణిగాడు!అంతకంటే మాటలు రాలేదు!

ఆవిడ కళ్ళు క్రమంగా ఎరుపెక్కాయి! కళ్ళలోంచి నిప్పులు కురవసాగాయి!

రౌద్రమూర్తి ఆకారం దాల్చింది!

నుదుటిమీది బొట్టు చెమటకు కారిపోతోంది! తల రేగిపోయిజుట్టు విడిపోయింది. మందారం క్రిందకి జారటానికి సిద్ధంగా ఉంది!

"చ నీచ్. నువ్వు.. ను..వ్వు...!"

## విలువ



పాతుకపోయిన
వేళ్ళను బట్టి కాదు
చెట్టుకు విలువ కట్టాల్సింది
కాసిన అమృత ఫలాల్ని.
ఇస్తున్న నీడను బట్టి.
—యస్.యస్. రెడ్డి

ఆమె నోట్లోంచి మాటలు ఒక విధంగా. బిగపట్టినట్లుగా వచ్చాయి. బయటనుంచి అందరూ అరుస్తున్నారు..

"అక్కయ్యా.... తలుపు... అమ్మా.... తలుపు తీయి." తలుపు చప్పుడవుతోంది. కాంతమ్మగారి దృష్టి హఠాత్తుగా పక్కన పేర్చిఉన్న కట్టెపుల్లలమీద పడ్డది. వణుకుతున్న చేతితో ఒకదాన్నిబయటకు లాగింది.

"అమ్మా.... నేను....నే.." చిన్ని తల్లి కాళ్ళకు చుట్టేసుకుపోయాడు.

ఆమె చేతిలోని కట్టెపుల్ల చెళ్ళున చిన్ని వీపుమీద నాట్యం చేసింది. వీపు చీరుకుపోయింది. రక్తం జివ్వున పైకి వచ్చింది.

"అమ్మా....కొట్టకమ్మా.. అమ్మా...." చిన్ని తల్లిని గట్టిగా చుట్టేసుకుపోసాగాడు.

ఆమె పూనకం వచ్చినదానిలా అయిపోయింది. ఆమె చేతిలోని కట్టెపుల్ల చిన్ని వీపును చీరేస్తోంది!

ఆవిడ తలలోని మందారం క్రింద పడిపోయింది! కట్టెపేళ్ళుగా అయిపోయింది. బయట గోల ఎక్కువయింది! తలుపు విరిగిపోతుందేమో నన్నంతగా బాదుతున్నారు. హఠాత్తుగా తలుపు తెరచుకుంది!

అందరూ చలనం లేని బొమ్మల్లా అయిపోయారు ఆమె భయంకరావతారం చూసి!

కాంతమ్మగారి చేతిలోని కట్టెపుల్ల జారిపోయింది. పెద్ద కొడుకు హఠాత్తుగా "అమ్మా" అంటూ పడిపోతున్న ఆమెను పొదవి పట్టుకున్నాడు! అప్పటికి ఆవిడ స్పృహ కోల్పోయింది!

లోపలికి చూసిన అందరి గుండెలూ ఆగిపోయాయి!

రక్తంలో పుట్టిన బిడ్డలా....రక్తంలో.... మసిలో....అన్నం మెతుకులమధ్య వెల్లకిలా పడిఉన్నాడు చిన్ని. ఒంటిమీది గుడ్డలు చిరిగి పీలికలయిపోయాయి!

అందరూ దిక్కుతోచనట్లుగా, అయోమయస్థితిలో అలాగే పిచ్చివాళ్ళలా ఎదుటి భయంకర దృశ్యాన్ని చూస్తుండిపోయారు.

"వాడి దగ్గరకు ఎవరూ వెళ్ళద్దు! ఆ పాపిష్టి వాడిని అలాగే చావనీండి!" రాఘవరావుగారు పెద్దగా అరిచాడు.

"నాన్నా...." కొడుకులు ఏదో చెప్పబోయారు.

"వద్దు! నా కేమీ చెప్పొద్దు! భోజనాలకి పదండి!"

అందరూ నెమ్మదిగా కదిలారు.

* * *

హఠాత్తుగా లేచి కూర్చుంది కావుడు. అంతా చీకటిమయం. తలతిప్పి చూసింది. అందరూ నిద్రపోతున్నారు. అందరూ ఆరుబయటే పక్కలు వేసుకుని పడుకున్నారు. వాతావరణం చాలా నిశ్శబ్దంగా ఉంది.

మధ్యాహ్నం జరిగిన సంఘటన కావుడు మెదడులో చెరగని ముద్ర వేసింది. ఎర్రటి రక్తం.... తెల్లని మెతుకులు.... నల్లటి మసి.... మధ్యన చిన్ని....

కావుడు ఒళ్ళు ఝల్లుమంది. భయమేస్తోంది. ఏడుపు తన్నుకు వస్తోంది. బిగ్గరగా ఏడవాలనిపిస్తోంది. గుండెల్లో ఏమిటోగా ఉంది.

"అమ్మా.... వద్దు.... కొట్టద్దు...." చిన్ని అరుపులు కావుడు చెవుల్లో ప్రతిధ్వనిస్తున్నాయి. నిలువెల్లా వణికిపోయింది. ఒళ్ళంతా చెమటలు పట్టేశాయి.

పైన ఆకాశం నిండా నక్షత్రాలు వెదజల్లిన ముత్యాల్లా వున్నాయి. వీధి చివర లైటు వెలుగుతోంది. ఎక్కడో ఊరకుక్క వుండుండి మొరుగుతోంది.

చటుక్కున లేచి నించుంది కావుడు. చుట్టూ జాగ్రత్తగా చూసి, కాళ్ళకి అడ్డం పడుతున్న పావడాని ఎత్తి పట్టుకుని నెమ్మదిగా సందులోకి నడిచింది.

కటిక చీకటి!

"చిన్ని అలాగే పడి ఉన్నాడు....దేవుడా ....చిన్నిని ఏం చేయొద్దు"కావుడు మనసు దేవుడిని తలుస్తోంది. ఉధృతంగా తన్నుకు వస్తున్న ఏడుపును బలవంతంగా అదిమి పెడుతోంది. చిన్ని ఆ పరిస్థితికి కారణం తనేమోనని భయభ్రాంతురాలవుతోంది.

హఠాత్తుగా ఆగిపోయింది. చేతులు పావడా అంచులని జార్చేశాయి. ఎదురుగా..

స్టోర్ రూమ్ తలుపు ఓరగా తీసి ఉంది. లోపల నుంచి సన్నటి కాంతి వస్తోంది. లోపలి దృశ్యం చూసి కావుడు స్తంభించిపోయింది. ఒక్కసారిగా గుండె గొంతులోకి వచ్చినట్లయింది.

కాంతమ్మగారి ఒళ్ళో చిన్ని వాలిపోయి ఉన్నాడు. అతని కళ్ళు మూసుకుపోయి ఉన్నాయి. నోరు తెరిచి ఉంది. అతని తల

వెనక బుడ్డి వెలుగుతోంది....అతని చుట్టూ గిన్నెలూ, పళ్ళాలు.... ఉన్నాయి.

వాటిల్లో పాయసం .... బూరెలు .... గారెలు.... అన్నం అన్నీ ఉన్నాయి. వాటి మీద ఈగలు ముసురుతున్నాయి. కాంతమ్మ గారి కళ్ళు ఎటో శూన్యంలోకి చూస్తున్నాయి. బొట్టు చెరిగిపోయి ఉంది.

ఆవిడ ఒక చేతిలో అన్నం కలిపిన ముద్ద ఉంది. మరో చేత్తో చిన్నిని పొదివి పట్టుకున్నట్లుగా ఉంది.

ఆవిడ దృష్టి చిన్ని మీద లేదు. ఓరగా తెరిచిఉన్న తలుపు నుంచి బాదంచెట్టుగుండా కనిపిస్తున్న ఆకాశం మీద ఉంది.

కావుడి కాళ్ళల్లో నుంచి వణుకు మొదలయింది. రెండు అడుగులు వెనక్కి వేసింది. అంతే! పిచ్చి పట్టినదానిలా, దయ్యం తరుముతున్నదానిలా పరిగెత్తుకు వచ్చి ఆయాసపడుతూ, గోడకానుకుంది.

ఊపిరి గబగబా వదలసాగింది. నెమ్మదిగా తలెత్తి చూసిన కావుడికి నక్షత్రాలతో నిండిన ఆకాశం ఇరుకుగా కనిపించింది. ●


## మీ చిగుళ్లను దృఢంగా వుంచుకోండి మీ పళ్లకు దీర్ఘ ఆయుస్సునివ్వండి





## కేవలం ఫోర్‌హెన్స్‌లో మాత్రమే చిగుళ్లను దృఢపర్చగల ఒక ప్రత్యేకమైన అస్ట్రింజంట్ కలదు

**ఝల్లుమనిపించే అనుభూతి ఇది పనిచేస్తున్నట్టుగా తెలుపుతుంది.**

ఆరోగ్యవంతమైన పళ్లకు కూడా గట్టి చిగుళ్ల ఆధారం అవసరం. చిగుళ్లు బలహీనమై మెత్తబడి పోయాయంటే మీ పళ్లకున్న గట్టి ఆధారం సడలిపోతుంది. అందుకే, చిగుళ్ల జీవధాతువును సంకోచపరిచి, బిగుతు చేయడానికి సహాయపడే ఒక ప్రత్యేకమైన అస్ట్రింజంట్‌తోటి సూత్రీకరించబడింది, ఫోర్‌హెన్స్. ఫోర్‌హెన్స్‌తో మీ పళ్లను బ్రష్ చేసుకుంటున్నప్పుడు మీకు కలిగే ఆ ఝల్లుమనిపించే అనుభూతి ఆ అస్ట్రింజంట్ చర్య వల్ల కలిగిందే. అదే, మీ చిగుళ్లను గట్టిగా, బిగుతుగా చేస్తున్న చర్య. దీనితో మీ పళ్లు ఆరోగ్యంగా మరింత కాలం నిలుస్తాయి.


కనుక మీ పళ్లకొక గట్టి ఆధారం కల్పించండి—ప్రత్యేకమైన అస్ట్రింజంట్ గల ఫోర్‌హెన్స్ టూత్‌పేస్ట్‌ను వాడండి.



మీ చిగుళ్లు బలహీనమైపోతే ఆరోగ్యవంతమైన పళ్లు కూడా వదులై పోతాయి.

ఫోర్‌హెన్స్‌లోని ప్రత్యేకమైన అస్ట్రింజంట్ చిగుళ్ల జీవధాతువును బిగుతు చేస్తుంది.

దీన్తో మీ చిగుళ్లకు మరింత బలం, మీ పళ్లకు మరింత ఆయుష్షు.




**ఫోర్‌హెన్స్‌ను విశ్వసించండి!** ఇది పళ్ల డాక్టరు సృష్టించిన టూత్‌పేస్టు.

306F-203 TEL